నేడు కడియం రాజు వర్ధంతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఏబీవీపీ దివంగత జాతీయ కార్యదర్శి, తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ కడియం రాజు ప్రథమ వర్ధంతి నేడు (20న) ఆర్ట్స్ కాలేజీలో జరగనుంది. కాలేజీలోని 133 తరగతి గదిలో జరిగే సభకు మిత్రులు, శ్రేయోభిలాషులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు హాజరవ్వాలని ఏబీవీపీ నాయకులు జీవన్ విజ్ఞప్తి చేశారు.

రిటైర్డ్ ఉద్యోగులను తొలగించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో వివిధ కార్యాలయాల్లో పని చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగాలను తొలగించాలని ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ నాయకులు ఓఎస్‌డీ ప్రొ.రెడ్యానాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆడిట్ సెల్, అంబేడ్కర్ రిసెర్చ్ సెంటర్‌లో పని చేస్తున్న రిటైర్ ఉద్యోగులతో పాటు దైరుతుల్ మారిఫిల్ డైరెక్టర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. అక్రమంగా కొనసాగుతున్న మైనార్టీ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొ.శుకూర్‌ను తొలగించాలని వినతిలో పేర్కొన్నారు. వినతి ఇచ్చిన వారిలో శ్రీకాంత్, వికాస్, వెంకటేష్, యుగేంధర్, మహేష్ ఉన్నారు.

ఓయూ పైలాన్‌ను సరి చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఇటీవల ప్రారంభించిన 100 ఏళ్ల పైలాన్‌ను సరిచేయాలని బహుజన విద్యార్థి సంఘాలు, ఓయూ జేఏసీ నాయకులు వేల్పుల సంజయ్, కొత్తపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. బుధవారం పైలాన్‌ను సందర్శించిన వారు 100 లోగో1పైన ముద్రించిన గుర్తు సీసా (బాటిల్) ఆకారంలో కనిపిస్తుందని, దాన్ని తొలిగించాలని అధికారులను కోరారు. అంతేకాక 100కు ఇరువైపుల పుస్తకాన్ని చదువుతున్న విద్యార్థుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్, భాస్కర్‌కుమార్, సతీష్, ఆనంద్, యుగంధర్, కృష్ణ, సూర్యం, సోని పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలు..
ప్రత్యేక బృందాలు

- ముమ్మరంగా ఎన్నికల ఏర్పాట్లు
- తుది దశకు పోలింగ్ కేంద్రాల సందర్శన
- లష్కర్‌లో ఎన్నికల సందడి మరూ

సికింద్రాబాద్: పార్లమెంట్ ఎన్నికల షెడ్యూలు విడుదలైన నేపథ్యంలో ఎన్నికల అధికారులు సమర్థవంతంగా పోలింగ్ నిర్వహించడం కోసం కసరత్తు ముమ్మరం చేశారు. ఒకవైపు పోలింగ్ స్టేషన్ల సందర్శన కార్యక్రమాలు కొనసాగుతుండగా మరోవైపు మంగళవారం 20 ప్రత్యేక తనిఖీ బృందాలను అధికారులు రంగంలోకి దింపారు. సికింద్రాబాద్ ప్రాంత పోలీసులు అప్రమత్తమై పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. పోలింగ్ స్టేషన్లను సందర్శిస్తూ పరిస్థితులను అంచనా వేయడంతో పాటు రూట్‌మ్యాప్‌లు సిద్ధం చేసుకుంటున్నారు. మంగళవారం సీతాఫల్‌మండి మల్టీపర్పస్ కమ్యూనిటీహాల్లో పోలీస్, ఎన్నికల అధికారులు, పర్యవేక్షలకుల సమావేశం నిర్వహించారు. సికింద్రాబాద్ ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తున్న డిప్యూటీ కలెక్టర్ ఎస్.ఎల్లారెడ్డి, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ డి.సుభాష్‌రావు, సికింద్రాబాద్ తహసీల్దార్ డీటీ నాయక్, నోడల్ అధికారి, చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డిలు సమావేశంలో పాల్గొని ఎన్నికల సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు.


తనిఖీల కోసం రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు

ప్రత్యేక బృందాలు..

సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఫ్లై స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ పేరిట 20 బృందాలను రంగంలోకి దింపారు. ఇందులో సర్వైలెన్స్ బృందాలు పోలింగ్ కేంద్రాల్లో వసతుల ఏర్పాట్ల ప్రక్రియను పర్యవేక్షిస్తున్నాయి. ఫ్లైయింగ్ టీంలు వాహనాల తనిఖీలు, ఎన్నికల నిబంధనలు అతిక్రమించే వారిని పట్టుకోవడం కోసం వినియోగిస్తున్నారు. ఒక్కో బృందానికి ఒక్కో వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఇకపై 24 గంటలు విధుల్లో ఉండే ఫ్లైయింగ్ టీంలు నాకాబందీలు నిర్వహించడం, అనుమానాస్పద వాహనాలు, వ్యక్తులను అదుపులోకి తీసుకుంటారు. 22 మంది ఎన్నికల పర్యవేక్షకులు, 220 మంది బూత్‌లెవల్ ఆఫీసర్ల నియామకాన్ని పూర్తి చేసినట్టు అధికారులు తెలిపారు.


ఎన్నికల సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు

నిఘా ముమ్మరం..

సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధి ఐదు పోలీస్‌స్టేషన్లు ఆవరించి ఉంది. ఇందులో అనుమానాస్పద వ్యక్తులు, రౌడీషీటర్ల సంఖ్య తక్కువగానే ఉంది. వీరి ద్వారా పోలింగ్ సమయంలో సమస్యలు పెద్దగా ఉత్పన్నం అయ్యే అవకాశాలు లేవు, అయినప్పటికీ మరోమారు పరిశీలిస్తున్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో 220 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 56 సమస్యాత్మక ప్రాంతాలు, 21 అత్యంత సమస్యాత్మక ప్రాంతాలు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ ప్రాంతాల్లోని అనుమానాస్పద, నేరగాళ్ల కదలికలపై నిఘా వేశారు.

ప్రశాంతంగా నిర్వహిస్తాం


ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియను ముగించేందుకు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. పోలింగ్ బందోబస్తు ఏర్పాట్లను ఇప్పటి నుంచే సిద్ధం చేసుకుంటున్నాం. ఇప్పటికే పెట్రోలింగ్ పెంచాం, త్వరలో పికెటింగ్‌లు ఏర్పాటు చేస్తాం. ఫ్రెండ్లీ పోలీస్ ద్వారా నేరాలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు రాబట్టగలుగుతున్నాం. పోలింగ్‌స్టేషన్ల సందర్శన, బందోబస్తు ఏర్పాట్లకు సంబంధించిన కార్యాచరణ తుదిదశకు చేరింది.

–జైపాల్‌రెడ్డి ఏసీపీ, ఎన్నికల నోడల్ అధికారి

పోలింగ్‌శాతం పెంచుతాం


సికింద్రాబాద్ ప్రాంతంలో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. శాసనసభ ఎన్నికల్లో తక్కువ పోలింగ్ జరిగిన ప్రాంతాలను ఎంపిక చేసి ఆయా ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకుంటున్నాం. కొత్త ఓటర్ల పేరు నమోదు కార్యక్రమం ఇంకా కొనసాగుతుంది అర్హులు నమోదు చేసుకోవాలి.

–డీ.సుభాష్‌రావు, జీహెచ్ఎంసీ డీసీ

సమాచారం ఇవ్వాలి..


ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే ఆయా ప్రాంత ప్రజలు పోలీసులకు లేదా ఎన్నికల అధికారులకు సమాచారం అందించాలి. సమాచారం అందించిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతాం. ఎలాంటి అవకతవకలను తావు లేకుండా పోలింగ్ జరుపాలన్నదే ఎన్నిలక కమిషన్ లక్ష్యం. ఇందుకు పౌరులంతా సహకరించాలి. పెద్దమొత్తంలో డబ్బు తరలింపు, వాహనాల పత్రాలు వాహనదారులు వెంట ఉంచుకోవాలి.

–ఎస్.ఎల్లారెడ్డి, డిప్యూటీ కలెక్టర్

23న ఓయూలో ఉద్యోగాల సెలబ్రేషన్స్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఈ నెల 23న ఉద్యోగాల సెలబ్రేషన్స్ నిర్వహించనున్నట్లు టీపీసీసీ అధికార ప్రతినిధి, పీహెచ్‌డీ విద్యార్థి చనగాని దయాకర్ బుధవారం పేర్కొన్నారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట సాయంత్రం 4 గంటలకు జరిగే కార్యక్రమంలో ఉద్యోగాలు సాధించిన ఓయూ విద్యార్థులను సన్మానించనున్నట్లు తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాధ్యం కాని ఉద్యోగాల భర్తీ 3 నెలల్లోనే 34 వేల పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగులకు భరోసా ఇస్తున్న కాంగ్రెస్ 100 రోజుల పాలనలో 6 గ్యారంటీలపై ప్రజల విశ్వాసాన్ని పొందిందన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 23, క్యారెట్ 19, దొండ 23, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 50, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 21, చామగడ్డ 45, మొరంగడ్డ 18, కందగడ్డ 50, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 15, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

పూలే ఆలోచన విధానాన్ని నేటి తరానికి అందించాలి


కార్యక్రమానికి హాజరైన ప్రతినిధులు

ఉస్మానియా యూనివర్సిటీ: మహాత్మా జ్యోతిరావు పూలే ఆలోచన విధానాన్ని నేటి తరానికి అందించాలని ఓయూ పూలే రిసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డా.చలమల్ల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ, ఓయూ పూలే రిసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో నేషనల్ సిపొజియం కమ్ షార్ట్ టర్మ్ రీసెర్చ్ ప్రాజెక్టు ప్రజెంటేషన్స్ (2023–24) కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన అధ్యాపకులు పాల్గొని పలు అంశాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రొ.మల్లేశం, ప్రొ.మంగు, ప్రొ.శ్రీనివాస్, డా.సయ్యదా అజీమ్ ఉన్నీసా, డా.ఇందిరా, డా.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతో దేశాభివృద్ధి



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

రసూల్‌పురా: గత పదేళ్లుగా దేశానికి సుస్థిర పాలన అందజేస్తూ అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. కంటోన్మెంట్ డ్రీమ్‌ల్యాండ్ గార్డెన్‌లో మంగళవారం కంటోన్మెంట్ పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశంలో ఈటల పాల్గొని మాట్లాడారు. గత పాలకుల అనాలోచిత నిర్ణయాల కారణంగా 2014 లో దేశ ఆర్థిక వ్యవస్థ పదకొండవ స్థానంలో ఉండగా మోదీ కృషితో ఐదో స్థానానికి చేరిందని అన్నారు. మూడోసారి మోదీకి అవకాశమిస్తే ప్రపంచంలోనే మూడవ స్థానానికి చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి, వివిధ చర్చిల పాస్టర్లు, బిషప్‌లు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం


రామాచారి

సనత్‌నగర్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బేగంపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలోని యూనివర్సిటీ స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్ మారోజు రామాచారి తెలిపారు. ఇంటర్మీడియేట్, ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులు పూర్తి చేసిన వారు డిగ్రీలో వివిధ కోర్సుల్లో అడ్మిషన్లకు అర్హులు అన్నారు. విద్య ద్వారా చదువుకోవాలనుకునే వారి కోసం యూనివర్సిటీ ఇటీవల డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేసిందని గుర్తు చేశారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువును మార్చి 31 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులు

లాలాపేట: తార్నాక ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పేరుతో నూతనంగా మహిళా సంఘం ఆవిర్భవించింది. మంగళవారం తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్లో జరిగిన సమావేశంలో కమిటీని ప్రకటించారు. అధ్యక్షురాలిగా ధనలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా సంధ్యారాణి, ఉపాధ్యక్షురాలిగా లక్ష్మీ పీసపాటి, జయలక్ష్మి, స్వరూపారాణి, సంయుక్త కార్యదర్శులుగా రమాదేవి, షబా ఫరూకీ, సుజాత గోగినేని, కోషాధికారిగా హరి కుమారి, సభ్యులు సుధా, నవ్య, మౌనిక, అనుపమా, శిరీష, హైమా నియమించారు.

బాలామృతం బలవర్ధకమైన ఆహారం


కార్యక్రమంలో పాల్గొన్న సునంద, అంగన్‌వాడీ టీచర్లు

లాలాపేట: అంగన్‌వాడీల కేంద్రాల ద్వారా అందజేస్తున్న బాలామృతం చిన్నపిల్లలకు బలవర్ధకమైన ఆహారం అని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సునంద అన్నారు. మంగళవారం లాలాపేట సత్యానగర్ కమ్యూనిటీ హాల్లో సికింద్రాబాద్ ప్రాజెక్ట్ మెట్టుగూడ సెక్టార్ ఆధ్వర్యంలో 'పోషణ పక్ష' వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సునంద మాట్లాడారు. అంగన్‌వాడీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. చిన్న పిల్లలు, బాలింతలు, గర్భిణులు, కిషోర బాలికలకు పోషకాహారాన్ని అంగన్‌వాడి కేంద్రాల ద్వారా అందజేస్తున్నట్లు వివరించారు. బాలామృతం పౌడర్ ద్వారా పలు రకాలైన వంటకాలు తయారు చేసి పిల్లలకు తినిపించాలన్నారు. గర్భిణులు తగు మోతాదులో ప్రోటీన్, విటమిన్స్, కాల్షియం ఉండే బలమైన పోషకాహారం తీసుకోవాలని తద్వారా ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిస్తారన్నారు. చిరుధాన్యాలు సజ్జలు, రాగులు, అరికెలు, జొన్నలు ప్రతి రోజు ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. ఆహారం తీసుకునే విషయంలో ఆరోగ్య పరిరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు తయారు చేసిన తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహార పదార్థాలను ప్రదర్శించారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా ప్రాంగణం నుంచి టైలరింగ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న పలువురి మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రేణుక, దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రాంగణం అధికారిణి వైష్ణవి, రవళి, శ్రీదేవి, అంగన్‌వాడి టీచర్లు కృపావతి, సంధ్యారాణి, రోజారాణి, గోదావరి, సుజాత, బస్తీ నాయకురాలు తిరుమల రేణుక పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి అధికారులను ఆదేశించారు. తుకారాం గేట్‌లోని ఇంద్రలక్ష్మి నగర్‌లో జరుగుతున్న సీవరేజీ పైప్ లైన్ పనులను జలమండలి అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్పొరేటర్ వెంట లింగాని శ్రీను, నక్క మధు, సత్తయ్య, మనోహర్, రామస్వామి, రవి, మల్లేష్, అంజయ్య, శ్రీశైలం ఉన్నారు.

నియామకం

సికింద్రాబాద్: లష్కర్ జిల్లా సాధన సమితి సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ కన్వీనర్‌గా సీతాఫల్‌మండికి చెందిన సీనియర్ నాయకుడు కొండల్ వెంకటేశ్వర్‌రావు నియమితులయ్యారు. ఆయనను కన్వీనర్‌గా నియమిస్తూ సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. సికింద్రాబాద్ పార్లమెంటరీ పరిధిలోని ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇవ్వడం ద్వారా వారి మద్దతు కూడగట్టామన్నారు. త్వరలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు కమిటీలను నియమించి ఉద్యమ కార్యాచరణను అమలులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శైలేందర్, గడ్డం ప్రసాద్, రవీందర్‌సాగర్, అశోక్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న పవన్‌కుమార్‌గౌడ్

జెక్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ ఉదారత


ఫర్నీచర్‌ను అందజేసిన అసోసియేషన్ సభ్యులు

సనత్‌నగర్: జెక్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మరోసారి ఉదారత చాటుకుంది. ప్రతియేడు స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసి అందజేయడం ఆనవాయితీ. అందులో భాగంగా ఈసారి బేగంపేట మాయూరిమార్గ్‌లోని దేవనార్ ఫౌండేషన్ ఫర్ బ్లైండ్ విద్యార్థులకు రూ.50,900 విలువైన ఫర్నీచర్‌ను అందజేశారు. 10 డ్యూయల్ డెస్క్ బెంచీలు, ఒక టీచర్ టేబుల్, ప్లాస్టిక్ చైర్ కొనుగోలు చేసి మంగళవారం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సాయిబాబాగౌడ్, కో–చైర్ పర్సన్ డాక్టర్ పద్మ సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గంగాధర్‌రావు, ఉపాధ్యక్షుడు మల్లు ప్రసాద్, సెక్రటరీ ఉమామహేశ్వరరావు, కోశాధికారి ఓసీఆర్ రెడ్డి, ఈసీ సభ్యులు పాండురంగారావు, ప్రకాష్‌రావు, ఎంఎస్ఆర్ మూర్తి, నర్సయ్య, వెంట్‌రావు, జీపీ రావు పాల్గొన్నారు.

ఉత్తమ సూపర్ సీనియర్ సిటిజన్స్‌కు ఉగాది పురస్కారాలు

సనత్‌నగర్: సమాజాన్ని చైతన్యపరిచేలా కార్యక్రమాల నిర్వహణతో పాటు సమాజ సేవలో తనవంతు భాగస్వామిగా నిలుస్తున్న వయోవృద్ధులతో పాటు సూపర్ సీనియర్ సిటిజన్స్‌కు ఉగాది పురస్కారాలను అందజేయనున్నట్లు ఖైరతాబాద్ సర్కిల్ ఆసరా కమిటీ ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి తెలిపారు. ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలోని సనత్‌నగర్,అమీర్‌పేట డివిజన్లకు చెంది 80 ఏళ్లు పైబడిన వారిని గౌరవిస్తూ ఈ అవార్డులను అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే సమాజ సేవ చేస్తున్న 60 ఏళ్ల పైడిన వారికి కూడా అవార్డులు అందించనున్నట్లు వివరించారు. మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో భాగంగా 60 ఏళ్లు పైబడిన వారు (సమాజ సేవ), 80 ఏళ్లు పైబడిన వారు (చైతన్య కార్యక్రమాలు) రెండు కేటగిరీల్లో ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు జేఎస్‌టీ శాయి 9440894873, డి.పార్థసారధి 9491117461 , ఆర్‌సీకుమార్ 9866520761 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

మద్యంమత్తులో వీరంగం సృష్టించిన యువకుల రిమాండ్


నిఖిల్, తరుణ్, తునీష్

చిలకలగూడ: మద్యంమత్తులో వీరంగం సృష్టించి, దాడులకు పాల్పడిన ముగ్గురిని జైలుకు తరలించారు. సీఐ అనుదీప్, అడ్మిన్ ఎస్ఐ బాలరాజు వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి మేడిబావికి చెందిన నిఖిల్ ఫ్రాన్సిస్ (22), చిలకలగూడ కిందిబస్తీకి చెందిన తునీష్ (20) సికింద్రాబాద్ ఓబెల్ కంప్యూటర్స్‌లో పని చేస్తుంటారు. ఆలుగడ్డబావికి చెందిన తరుణ్‌కుమార్ (23) లేబర్. ముగ్గురు స్నేహితులు నిత్యం తాగి న్యూసెన్స్ చేస్తుంటారు. ఈ నెల 17న మేడిబావిలోని ఓ భవనం రెండో అంతస్తులో పార్టీ చేసుకున్నారు. పూటుగా మద్యం తాగి కేకలు వేస్తూ గొడవ పడ్డారు. స్థానికులు అభ్యంతరం చెప్పడంతో పై నుంచి ఖాళీ బీరు బ్యాటిళ్లు విసురుతూ దాడులకు పాల్పడ్డారు. అదే ప్రాంతానికి చెందిన టైలర్ నర్సింగరావు (42) తలకు తగలడంతో రక్తపు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిఖిల్ ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు.

మరో ఘటనలో ల్యాప్‌టాప్ దొంగ..

సికింద్రాబాద్: రైలు ప్రయాణికుల ల్యాప్‌టాప్‌లను చోరీ చేస్తున్న దొంగను రిమాండ్‌కు తరలించారు. రైల్వే ఎస్పీ షేక్ సలీమా కథనం ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ సాయిశ్వర్‌గౌడ్, రైల్వే ఎస్ఐలు ఎంఏ మాజిద్, డి.రమేశ్ నేతృత్వంలో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో 1వ నెంబర్ ప్లాట్‌ఫామ్ 4వ గేట్ వద్ద అనుమానాస్పదంగా ఓ వ్యక్తి తచ్చాడుతుండగా అదుపులోకి తీసుకుని విచారించగా రైలు ప్రయాణాల్లో ఏసీ బోగీల్లో నిద్రలోకి జారుకున్న ప్రయాణికుల ల్యాప్‌టాప్‌లను దొంగిలిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా హోర్తి గ్రామానికి చెందిన శ్రీశాయి భోసగి (29), ఉద్యోగం కోసం సికింద్రాబాద్‌కు వచ్చానని, ఉద్యోగం లభించని కారణంగా దొంగిలించిన ట్యాప్‌టాప్‌లను విక్రయించడం ద్వారా వచ్చిన డబ్బుతో జీవిస్తున్నట్టు తెలిపాడు.

23న ఫాల్కనర్ వర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు


బ్రోచర్‌ను ఆవిష్కరించిన యూనివర్సిటీ ప్రతినిధులు

అమీర్‌పేట: భారతీయ విద్యార్థులకు ఫాల్కనర్ యూనివర్సిటీ అధునాతన బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సులను అందుబాటులోకి తెచ్చిందని విశ్వవిద్యాలయ అధ్యక్షులు మిచ్ హెన్రీ తెలిపారు.అమీర్‌పేట హోటల్ ఆదిత్య పార్క్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 23న బేగంపేటలోని హోటల్ తాజ్ వివంతాలో స్పాట్ అడ్మిషన్లు అందిస్తున్నట్లు చెప్పారు.అలబామాలో గల మాంట్ గోమెరీకి చెందిన ఫాల్కన్ వర్సిటీలో మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ మేనేజిమెంట్ ఇన్ బిజినెస్ అనలిటిక్స్,మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ మేనేజిమెంట్ ఇన్ ఐటీ వంటి కోర్సులు అభ్యాసించాలనుకునే వారికి అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు వివరించారు. భారతీయ విద్యార్థులకు విశ్వవిద్యాలయ ఎంపిక, ట్యూషన్ ఫీజులు, వీసా ఇంటర్వ్యూల వంటి అంశాల్లో సహకారం అందిస్తామని నగరానికి చెందిన యూనివర్సిటీ హబ్ నిర్వాహకులు డా.అనిల్ పల్లా తెలిపారు. అనంతరం బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

ముదిరాజ్‌లకు న్యాయం చేయాలి

పంజగుట్ట: ఫిషరీస్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ముదిరాజ్‌లకు కాకుండా గంగపుత్రులకు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలంగాణ ముదిరాజ్ మహా సంఘం రాష్ట్ర కన్వీనర్ గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్ అన్నారు. చైర్మన్ పదవి మెట్టు సాయి అనే గంగపుత్ర సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి ఇచ్చి జీవోలో మాత్రం ముదిరాజ్‌లకు ఇచ్చినట్లుగా చూపించడం దారుణమన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు గొడుగు శ్రీనివాస్, ముదిరాజ్ మహాసంఘం కో కన్వీనర్ అల్లుడు జగన్ ముదిరాజ్‌తో కలిసి మాట్లాడుతూ.. మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో 90 శాతం ముదిరాజ్‌లవే ఉన్నాయని, సభ్యులు కూడా 90 శాతం వారు ఉన్నారని, తమను కాదని గంగపుత్రులకు చైర్మన్ పదవి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలని, మత్స్య అభివృద్ధి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఇప్పటికే బీజేపీ ఈటల రాజేందర్, బీఆర్ఎస్ కాసాని జ్ఞానేశ్వర్‌లకు ఎంపీ టికెట్లు కేటాయించాయని, కాంగ్రెస్ కూడా మెదక్ ఎంపీ టికెట్‌ను నీలం మధుకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

కేరళలో హెలీ టూరిజం




పంజగుట్ట: దేశీయంగా ఉన్న పర్యాటకులను పెంచుకునేందుకు కేరళ టూరిజం ఎప్పటికప్పుడు కొత్త ప్రణాళికలను రూపొందిస్తుందని కేరళ టూరిజం ఇన్‌ఫర్మేషన్ ఆఫీసర్ మహ్మద్ సలీం తెలిపారు. కేరళ టూరిజం అభివృద్ధిలో భాగంగా మంగళవారం సోమాజిగూడ లోని పార్క్ హోటల్‌లో హోటల్స్ నిర్వాహకులు, టూర్ ఆపరేటర్లు, ట్రావెలర్స్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేరళ సంప్రదాయ నృత్యాలు, వేషధారణలతో ఆహుతులను అలరించారు. అనంతరం మహ్మద్ సలీం మాట్లాడుతూ .. పర్యాటకులను పెంచుకునేందుకు గతంలో కేరవన్ టూరిజం ప్రవేశ పెట్టామని, ఇప్పుడు తాజాగా హెలీ టూరిజంను ప్రవేశపెట్టబోతున్నట్లు తెలిపారు. హెలీ టూరిజానికి స్కై ఎస్కేప్స్ గా నామకరణం చేశామన్నారు. దేశంలో సమగ్ర హెలీ టూరిజం పాలసీని తీసుకువచ్చిన తొలి రాష్ట్రంగా కేరళ నిలిచిందన్నారు.

ఆధారాలు లేని రూ.15 లక్షలు స్వాధీనం

రాంగోపాల్‌పేట్: ద్విచక్ర వాహనంపై నగదు, ఓపీఎం మత్తు మందును తరలిస్తున్న ఓ వ్యక్తిని మార్కెట్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ వివరాల ప్రకారం.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మార్కెట్ పోలీసులు మోండా మార్కెట్ ప్రాంతంలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానాస్పదంగా వెళ్తున్న శాస్త్రీపురం రాజేంద్రనగర్‌కు చెందిన రమేష్ కుమావత్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా రూ.15లక్షల నగదుతో పాటు 120 గ్రాముల ఓపీఎం మత్తు మందు లభించింది. అతని వద్ద డబ్బుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదు. చెన్నై నుంచి ప్రేమ్‌గిరి అనే వ్యక్తి పంకజ్ జైన్ దగ్గర నుంచి డబ్బులు తీసుకుని ఎక్కడ ఇవ్వాలో చెబుతానని తనకు సమాచారం ఇచ్చారని నిందితుడు చెప్పాడు. ఇది హవాలా డబ్బు ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం స్వాధీనం

చిలకలగూడ : గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైన ఘటన చిలకలగూడ ఠాణా పరిధిలో జరిగింది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి సమీపంలోని మెట్రోపిల్లర్ నంబరు–1015 వద్ద వృద్ధుడు అపస్మాకరస్థితిలో పడిఉన్నట్లు సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా మృతి చెందినట్లు నిర్ధారించి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

లిబర్టీ: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు దళిత బహుజన విద్యార్థి సమైఖ్య తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు వలిగొండ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఉపముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ దాదాపు రూ. 4 వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఫీజు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని కళాశాలల యాజమాన్యాలు వేధింపులకు గురి చేస్తున్నాయని ఆరోపించారు. పాఠశాల నుంచి కళాశాల విద్యాస్థాయి వరకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు.